**మినీ కథ**

# నేటి తరానికి

భారత దేశాన్ని వివేకానందుడు గురజాడ ఎంతగానో ప్రేమించారు. వారు, హరిజన గిరిజన, బడుగు వర్గాలవారు అందరూ నా సోదరులే. అందరిదీ ఒకే కులం, ఒకే మతం, ఒకే రక్తం అని బోధించారు. కాని, నేటి సమాజములో కులాల అడ్డుగోడలు. బలమైన యినుప తలుపులుగా భావించే పెద్దమనుషులు యింకా మారలేదు. సంఘ సంస్కర్త, ఎన్నో ఉపన్యాసాలు చెప్పిన పెద్దమనిషే జగన్నాధం గుగ్గిలంలాగ మండి పోతున్నాడు.

గదిలో ఆటూ యిటూ పచార్లు చేస్తూ చిందులు తొక్కుతున్నాడు. ఛీ....దుర్మార్గుడు - సిగ్గు లేదు! నా కడుపున చెడ పుట్టాడు. ఇంటిలో పరువు, వంశం, మర్యాద ఏం చూశాడు? నా కడుపున చెడ పుట్టాడు - అని అంటూ ఆదర్శ ప్రజాదరనోద్ధరణ అని బిరుదును తగిలించుకొన్న జగన్నాధం మాట్లాడుతున్నాడు.

ఉన్నట్టుండి ఎదురుగా ఫొటోలో భార్య బాధ పడుతున్నట్టు అనిపించింది.

'జానకీ! బాధ పడుతున్నావా? నాకు మాత్రం ఇష్టమా వాడిని తిట్టడం? కానీ వాడు చేసిన పనిచూడు. వాణ్ణి కని నువ్వు కన్ను మూస్తే తల్లీ, తండ్రీ, నేనే అయి పెంచానే! విద్యాబుద్ధులు చెప్పించి ఉద్యోగస్తుని చేశానే? వాడొక ఇంటివాడైతే - మనుమలతో ఆడుకుంటూ కూర్చోవచ్చనుకొన్నాను.

లక్షణంగా మన దగ్గర బంధువుల ఇంట సాంప్రదాయమైన పిల్లని చేద్దామనుకొన్నా. నా ఆశలు నెట్టేసి. ఆ కులం లేని దానిని చేసుకొంటాడా? పైగా ఈ కులాలు మతాలు మనం కల్పించుకొన్నవే. మనుషులంతా ఆ దేవుని బిడ్డలే అంటాడా? మాలవాణ్ని చూస్తే స్నానం చేస్తేకాని భోం చెయ్యని నా నియమం నా నిష్ట ఏమవాలి? ఆ మాలది వంట చేస్తే ఎలా తినను? రేపు వాళ్ళకు పుట్టే పిల్లలు మూలాన మనకి పుణ్యలోకాలుండవు.' అని ఫొటోలో ఉన్న భార్యతో తన బాధ అంతా చెప్పాడు జగన్నాధం.

* * *

జగన్నాధం కొడుకు రాజా. గిరిజను ప్రేమించి రిజిష్టర్ ఆఫీసులో పెళ్ళి చేసుకొని, యిద్దరూ నడుచుకొంటూ వస్తున్నారు.

'గిరిజా! మా తండ్రికి కోపమైనా, తర్వాత శాంత పడతాడు. నేనంటే ఎంతో ప్రేమ. నిన్ను వివాహమాడానని దెబ్బలాడినా నన్ను చూసి మారిపోతాడు అని అనుకొంటాను. లేకపోతే....లేకపోతే మన దాంపత్య నావ కన్నీటి కడలిలో సాగిపోవాలి. మీరు చాల మంచివారు. ఆదర్శవంతులు. అభ్యుదయ భావాలు గలవారు. మీ వంటి వారి నీడ దొరకడం నా పూర్వజన్మ సుకృతం అని ప్రేమగా అంది గిరిజ. అలా అని యిద్దరూ జగన్నాధరి యింటికి వచ్చారు.

వాళ్ళను చూడగానే జగన్నాథానికి చెప్పలేనంత కోపము వచ్చింది. పళ్ళు పటపటా కొరుకుతూ, ఓ క్షణం అలాగే నిలుచుండి పోయారు.

ఇంతలో రాజా, గిరిజా 'నీకేమీ భయం లేదు. నేను చెప్పినట్టు చెయ్యి!' అని యిద్దరూ వెళ్ళి అతని కాళ్ళమీద పడి దండం పెట్టారు. కొంత సేపటికి తెలివి తెచ్చుకొని జగన్నాథం ఎదురుగావున్న గురజాడ పకపకా నవ్వుతూ, ఎవరికి వారే యిలా మడి గట్టుక్కూర్చుంటే మనకానాడు స్వరాజ్యం మొచ్చేదా? నేను అన్ని తరాలకు మార్గ దర్శకుడని. 'గురజాడ అడుగుజాడలో నీ మనుగడ సాగించు' అని రోజూ నీకొడుక్కి బోధించే వాడివే! నీలా వట్టి మాటలతో కట్టిపెట్టక చెప్పినది చేసి చూపించిన ఆదర్శవాది నీ కొడుకు రాజా! అలాంటి వాడిని, నేటి సమాజానికి జ్ఞానోదయం కలిగించిన యువతర భావాలు గలవాడిని యింట్లోనుంచి తరిమి వేస్తావా? ఇదేనా నీ సంస్కరణ? అందరూ ఒకే కులమని, ఎన్ని వర్ణాంతర వివాహాలు నీ చేతిమీదుగా ఎంతో మందికి చేయించి, నీదాకా రాకపోయేటప్పటికి ఇదేనా పని? ఈ పని నీ కొడుకు చేస్తే నీవు హర్షించలేక పోయావా అని గురజాడ జగన్నాథాన్ని నిలదీసి అడిగినట్లనిపించింది. వెంటనే జగన్నాధం శాంతపడి, మనస్సు మార్చుకొని. కొడుకిని-కోడలిని లేవనెత్తి ఆశీర్వదించి సంతోషముతో తన తోటివారందరికి విందు భోజనం ఏర్పాటు చేసి, అందరితోనూ నేటి తరానికి నా కొడుకు రాజా మార్గదర్శి మన కెన్నో హితాలున్నా. ఎన్ని కులాలున్నా మనమంతా దేని దృష్టి ఒకటే! మనమంతా భారతీయులం! అని ప్రసంగించాడు.

—శ్రీ ఏద్దిపర్తి సూర్యనారాయణ.

